సాక్షి
కుమురం భీం
సోమవారం । 3 । ఏప్రిల్ । 2023



నిదానంగా మైదానం పనులు

నస్పూర్‌లోని సింగరేణి స్టేడియం నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాదైనా పూర్తి కాలేదు. క్రీడాకారులు ఐదు కిలోమీటర్ల దూరంలోని ప్రగతి స్టేడియానికి వెళ్తున్నారు. 8లో▸



సమస్యల్లో సంత

బెజ్జూర్ మండలకేంద్రంతోపాటు నలుగుపెల్లి వారసంతల్లో సమస్యలు తిష్టవేశాయి. వీటి ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతున్నా వసతులు కల్పించడంలేదు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.6 /24.5

ఆకాశంలో కొంతమేర మేఘాలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ : 6:30	మంగళ : 4:45

న్యూస్‌రీల్

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కమిటీలో జిల్లావాసులు



రాంపల్లి విజయ



దిగదేతుల రాధిక

ఆసిఫాబాద్‌అర్బన్: జాతీయ చేనేత ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీలో జిల్లా కేంద్రానికి చెందిన పద్మశాలీ సేవా సంఘం సభ్యులకు చోటు కల్పించారు. సంఘం పట్టణాధ్యక్షురాలు రాంపల్లి విజయ వేదిక మహిళా విభాగం ప్రచార కార్యదర్శిగా, కార్యనిర్వహణ కమిటీ సభ్యురాలిగా దిగదేతుల రాధిక ఎంపికైనట్లు రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించినట్లు వెల్లడించారు. నియామక ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మహిళా సభ్యులను పలువురు అభినందించారు. తమపై నమ్మకంతో నూతన బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర కమిటీకి విజయ, రాధిక కృతజ్ఞతలు తెలిపారు. ఐక్యవేదిక ద్వారా చేనేత కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.

రేపు జాబ్ మేళా

కాగజ్‌నగర్‌టౌన్: ద టైమ్స్ ప్రో ఆధ్వర్యంలో ఐసీఐసీఐ బ్యాంక్‌లలో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టు నియామకానికి కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 4న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని, పూర్తి వివరాలకు 7893922966 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం



సుధాకర్



సంపత్‌కుమార్

రెబ్బెన(ఆసిఫాబాద్): చెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం గోలేటిటౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ఎన్నుకున్నట్లు ఉమ్మడి జిల్లా చెస్ అభివృద్ధి చైర్మన్ ఈగ కనకయ్య తెలిపారు. జిల్లా చీఫ్ పాటర్న్‌గా ఆర్ నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా కోట సుధాకర్, ఉపాధ్యక్షులుగా బోగె ఉపేందర్, ఈ వామన్, కే భాస్కర్, బీ గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా సమిల్ల సంపత్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఐ.సమ్మయ్య, సంయుక్త కార్యదర్శిగా కే నరేశ్, కోశాధికారిగా కుమ్మరి మల్లేశ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎల్.హరిలాల్, ఎండీ తాజొద్దీన్, మియాపురం తిరుపతి, పీ తిరుపతి ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యమివ్వాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

తిర్యాణి: ఏజెన్సీ ప్రాంతాల్లో చేపట్టే అవుట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాల్లో గిరిజనులకే మొదటి ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మండల కేంద్రంలోని కుమురంభీం చౌరస్తా వద్ద ఆదివాసీల సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ డివిజన్ అధ్యక్షుడు వెడ్మ భగవంత్‌రావు మాట్లాడారు. ఇటీవల మండల కేంద్రంలోని ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డు నియామకాలు పూర్తిగా గిరిజనేతరులతో భర్తీ చేశారని తెలిపారు. వెంటనే వారిని తొలగించి గిరిజనులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ మండలాధ్యక్షుడు ఆత్రం గోపాల్, ప్రధాన కార్యదర్శి తోడసం భాస్కర్, డివిజన్ ఉపాధ్యక్షుడు గెడం సుభాష్, నాయకులు కొట్నాక గణపతి, గంగారాం, పెందూర్ ధర్ము తదితరులున్నారు.



టెన్షన్ వద్దు



- నేటి నుంచి పదోతరగతి పరీక్షలు
- జిల్లాలో 39 కేంద్రాలు ఏర్పాటు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పరీక్షలకు 7,141 మంది విద్యార్థులు
- భయం వద్దంటున్న వైద్య నిపుణులు

ఆసిఫాబాద్‌రూరల్: పదోతరగతి పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలో 39 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 7,141 మంది విద్యార్థుల పరీక్షలు రాయనున్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థుల కోసం అన్ని వసతులు కల్పించినట్లు డీఈవో అశోక్, జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు తెలిపారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. విద్యాశాఖ నిబంధనల మేరకు జిల్లాలో పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించనున్నట్లు డీఈవో పేర్కొన్నారు.

సిబ్బంది కేటాయింపు ఇలా..

జిల్లాలో ఏర్పాటు చేసిన 39 పరీక్ష కేంద్రాలకు తగిన సిబ్బందిని నియమించారు. ఒక్కో కేంద్రంలో ఒక్కోచీఫ్ సూపరింటెండెంట్ విధులు నిర్వర్తిస్తారు. జిల్లా వ్యాప్తంగా 40 మంది డిపార్టుమెంటల్ అధికారులు, 40 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 415 మంది ఇన్విజిలేటర్లు, 39 మంది అటెండర్లు, ప్రతీ కేంద్రానికో వైద్య సిబ్బందిని నియమించినట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షల విషయంలో ఫిర్యాదులు, సందేహాలుంటే డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూంను లేదా 9441540927 నంబర్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

రెండు పేపర్లకే అదనపు సమయం

గతంలో 11 పేపర్లు రాయాల్సి ఉండగా ఈసారి ఆరు పేపర్లకు కుదించారు. పరీక్ష ఉదయం 9.30 నుంచి 12.15 వరకు ఉంటుంది. అంటే మూడు గంటలు కానీ.. సైన్స్, మొదటి భాష (కాంపొజిట్ పేపర్లు) పరీక్షలు మాత్రం 3.20 గంటలు ఉంటాయి. అదనంగా 20 నిమిషాలు ఉంటుంది. తెలుగు, ఉర్దూపేపర్లు పార్ట్–1 ఉదయం 9.30 నుంచి 11.30గంటల వరకు, పార్ట్–2 పేపర్లు ఉదయం 11.50 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు ఉంటాయి. సైన్స్ పేపర్ పార్ట్–1 (భౌతికశాస్త్రం) ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు, పార్ట్–2 (జీవశాస్త్రం) ఉదయం 11.20 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు ఉంటాయి. ఈ రెండు పేపర్లకు వేర్వేరు ప్రశ్నపత్రాలు, సమాధాన పత్రాలు ఇవ్వాల్సి ఉండడంతో వీటిని మార్చుకునేందుకు గడువునివ్వడంలో భాగంగా అదనపు సమయాన్ని కేటాయించినట్లు అధికారులు పేర్కొన్నారు. మొత్తం 7,141 మంది విద్యార్థులకు తెలుగు మీడియంలో 5,422 మంది, ఇంగ్లిష్ మీడియంలో 1,468, ఉర్దూ మీడియంలో 251 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

విద్యార్థులకు సూచనలు

- పరీక్ష కేంద్రానికి యూనిఫాంతో కాకుండా సివిల్ డ్రెస్‌లో రావాలి.
- పరీక్ష సమయాని కంటే గంట ముందే సెంటర్‌కు చేరుకోవాలి.
- సెల్‌ఫోన్లు, కాలిక్యులేటర్, ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలు వెంట తీసుకువెళ్లవద్దు.
- చివరి నిమిషంలో అనవసర హడావుడి అసలే వద్దు.
- పరీక్ష కేంద్రంలో ఇచ్చే ఓఎంఆర్ షీట్ సరిగా చెక్ చేసుకోవాలి.
- పరీక్ష ప్యాడ్ తప్పనిసరిగా వెంట తీసుకువెళ్లాలి. రెడ్ పెన్ను వాడరాదు.
- ఎలాంటి ఒత్తిడికి లోనుకావద్దు.
- దూరప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో వచ్చేవారు హాల్‌టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చు.
- ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు హాల్‌టికెట్లు ఇవ్వకుంటే bse.telangana.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.

విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు



విద్యార్థులు పరీక్ష సమయంలో ఒత్తిడికి లోనుకావద్దు. జిల్లాలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆయిల్ ఫ్రైతో చేసిన వంటలు, నాన్‌వెజ్ (చికెన్, మటన్) లాంటి ఆహార పదార్థాలు తీసుకోవద్దు. సులభంగా జీర్ణమయ్యే ఆహారపదార్థాలు తీసుకోవాలి. రోజుకు కనీసం 10 గంటలు నిద్రపోవాలి. భయం, ఆందోళన వీడి ప్రశాంతంగా పరీక్ష రాస్తే మంచి మార్కులు సాధిస్తారు.

– సత్యనారాయణ, వైద్యుడు

గంట ముందే చేరుకోవాలి



జిల్లాలో పదోతరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాలి. ముందుగా ప్రశ్న పత్రాన్ని పూర్తిగా చదివి అర్థం చేసుకున్నాకే సమాధానాలు రాయాలి. భయం, ఆందోళన లేకుండా పరీక్షలు రాయాలి.

– అశోక్, జిల్లా విద్యాశాఖాధికారి

కనుల పండువగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, హనుమాన్ దీక్షాపరులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం హనుమాన్ దీక్షాపరుల ఆధ్వర్యంలో ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు ఆలయం వద్ద శోభాయాత్ర ప్రారంభించారు. ఆలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా నిర్వహించిన శోభాయాత్ర దీక్షాపరులతో కాషాయమయమైంది. జై హనుమాన్ నినాదాలు మార్మోగాయి. 11 అడుగుల వీరాంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రత్యేక రథంపై ఏర్పాటు చేసి సాయిబాబా మందిర్, పొట్టి శ్రీరాములు చౌక్, శివకేశవ మందిర్, గణేశ్‌మందిర్, రావులవాడ, కసాబ్‌వాడ, సందీప్‌నగర్, బజార్‌వాడి, వివేకానందచౌక్, అంబేడ్కర్ చౌక్ మీదుగా యాత్ర కొనసాగింది. డీజే పాటలు, దీక్షాస్వాముల నృత్యాలతో శోభాయాత్ర ఆద్యంతం హోరెత్తింది. సుమారు ఐదు కిలోమీటర్ల మేర శోభాయాత్ర సాగగా గడపగడపకూ మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు శోభాయాత్రలో భక్తులతో కలిసి నృత్యం చేశారు. ప్రముఖ వ్యాపారి రావుల వెంకటేశ్వర్, పలువురు భక్తులు మజ్జిగ పంపిణీ చేశారు. ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, ఏఎంసీ మాజీ చైర్మన్లు చిలువేరు వెంకన్న, గంధం శ్రీనివాస్, బీజేపీ ఉపాధ్యక్షుడు ఖాండ్రే విశాల్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు డీ వెంకటేశ్వర్లు, కోశాధికారి గుండ వెంకన్న, కమిటీ ప్రతినిధులు పిన్న వివేక్, ఎకిరాల శ్రీనివాస్, టీ మురళీధర్ గౌడ్, డాక్టర్ రూప్‌నర్ రమేశ్, గడ్డల వెంకన్న, ప్రకాశ్‌గౌడ్, సాయిని రాజశేఖర్, కరణ్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో పాల్గొన్న దీక్షాపరులు

‘బీఆర్‌ఎస్ దేశానికే దిక్సూచి’



మాట్లాడుతున్న నారదాసు లక్ష్మణ్‌రావు

కెరమెరి(జైనూర్): బీఆర్‌ఎస్ దేశానికే దిక్సూచి లాంటిదని పార్టీ జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ఆదివారం జైనూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో వారు మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అబద్ధాలను నిజాలుగా నమ్మించే ప్రయత్నం చేస్తున్నాయని, ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ హయాంలో పల్లెలు, పట్టణాలు ఎంతో అభివృద్ధి చెందాయని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరుస్తున్నామని తెలిపారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాసంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ గోడం నగేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదోరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, ఆసిఫాబాద్ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, జైనూర్ ఎంపీపీ తిరుమల, మండలాధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వృత్తి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రాజేశం, పక్కన ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): కుమ్మర కులస్తులు వృత్తి శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా వృద్ధి చెందాలని అడిషనల్ కలెక్టర్ రాజేశం, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) అచ్చేశ్వర్‌రావు సూచించారు. మండలంలోని కైరిగాంలో కొద్దిరోజులుగా కొనసాగుతున్న మట్టిపాత్రల తయారీ శిక్షణ శిబిరాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా కుమ్మరులు అధునాతన పద్ధతులతో తయారు చేస్తున్న మట్టి పాత్రలు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో చేపట్టిన మట్టి పాత్రల తయారీ శిక్షణను కుమ్మర కులస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్కెట్‌లో లభిస్తున్న ప్లాస్టిక్, స్టీల్ వస్తువులకు ప్రత్యామ్నాయంగా ప్రతి ఒక్కరూ మట్టి పాత్రల వినియోగంపై దృష్టిసారించాలన్నారు. తయారు చేస్తున్న మట్టి పాత్రలను సులభంగా అమ్ముకునేలా జిల్లా కేంద్రంలో వసతులు కల్పిస్తామని తెలిపారు. మార్కెట్‌లో స్థలం ఏర్పాటుతో పాటు షెడ్డును కూడా ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. మట్టి పాత్రల శిక్షణ కుమ్మర కుల వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న వారి జీవితాల్లో వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు కుమ్మరి మల్లేశ్, జిల్లా టూరిజం అధికారి రామకృష్ణ, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మొండి, కార్యదర్శి మహేశ్, ఎర్ర సంతోష్, ఉప్పులేటి మల్లేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్ర తిరుపతి, రమేశ్, నాయకులు పోషన్న, మాస్టర్ రమేశ్, విష్ణు, శంకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘సర్వాయి పాపన్న ఆశయాలు కొనసాగిద్దాం’



పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: గౌడ కులస్తుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన మహోన్నత వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని కలెక్టర్ బొర్కడె హేమంత్ సహదేవ్‌రావ్ పేర్కొన్నారు. ఆదివారం పాపన్న గౌడ్ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. 17వ శతాబ్దంలో పాపన్నగౌడ్ కులవృత్తి చేసుకొని జీవించేవాడని, తురుష్క, మొగలుల పాలనలో సైనికుల ఆగడాలను ఎదిరించి గౌడ కులస్తుల సంక్షేమానికి పోరాడారని గుర్తు చేశారు. ఆయన సేవలకు గుర్తుగా ప్రభుత్వం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరిట పోస్టల్ కవర్ విడుదల చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పాపన్నగౌడ్ వర్ధంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయి, బీసీ సంక్షేమాధికారి సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్, గౌడ సంఘం నాయకుడు బాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పశువులను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

సిర్పూర్(టి): మండలం మీదుగా కరీంనగర్ జిల్లాకు పశువులను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా 23 పశువులను వ్యాన్‌లో తరలిస్తున్నారని తెలిపారు. ఆదివారం వేకువ జామున పెద్దబండ గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై వ్యాన్‌ను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఠాణాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దహెగాంకు ఆర్టీసీ బస్సు

సాక్షి ఎఫెక్ట్



దహెగాంకు వచ్చిన ఆర్టీసీ బస్సు

దహెగాం: కాగజ్‌నగర్ మీదుగా దహెగాం మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సు సేవలు కొన్ని నెలలుగా నిలిచిపోగా ప్రయాణికుల ఇబ్బందులను వివరిస్తూ ‘సాక్షి’లో శనివారం ‘ప్రైవేటే దిక్కు’ శీర్షికన ప్రచురించిన కథనానికి స్పందన వచ్చింది. ఆర్టీసీ అధికారులు దహెగాంకు బస్సు వేశారు. కాగజ్‌నగర్ నుంచి ఉదయం 8గంటలకు బస్సు బయలుదేరుతుందని అధికారులు తెలిపారు. కాగజ్‌నగర్ నుంచి దహెగాంకు 30 కిలోమీటర్ల దూరం ఉండగా సుమారు గంట సమయం పడుతుందని పేర్కొన్నారు. కాగా, సోమవారం నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉదయం 7.30 గంటలకే కాగజ్‌నగర్ నుంచి బయలుదేరితే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ డీఎం శ్రీధర్ ‘సాక్షి’తో మాట్లాడుతూ.. శనివారం నుంచే దహెగాంకు బస్సు నడుపుతున్నామని తెలిపారు. ప్రయాణికులు సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించకుండా ఆర్టీసీని ఆదరించాలని కోరారు. కాగజ్‌నగర్ నుంచి ఉదయం 7.30 గంటలకే బస్సు బయలుదేరేలా చూస్తామని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులు హాల్‌టికెట్ చూపించి బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చని సూచించారు. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తంజేస్తున్నారు.

చెస్ పోటీల్లో సత్తా చాటాలి



రాష్ట్రస్థాయికి ఎంపికైనవారితో అసోసియేషన్ సభ్యులు

రెబ్బెన(ఆసిఫాబాద్): హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని ఉమ్మడి జిల్లా చెస్ అభివృద్ధి చైర్మన్ ఈగ కనకయ్య సూచించారు. ఆదివారం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి అండర్–17 బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో చెస్ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ఇప్పటివరకు జిల్లా నుంచి చెస్‌లో ప్రాతినిధ్యం అంతంత మాత్రంగానే ఉందని, భవిష్యత్‌లో జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఉపేందర్, భాస్కర్, వామన్, ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సమ్మయ్య, సంయుక్త కార్యదర్శి నరేశ్, సభ్యులు హరిలాల్, తాజొద్దీన్, తిరుపతి పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోట సుధాకర్ తెలిపారు. బాలుర విభాగంలో ఈ ప్రజ్ఞ, జీ శివకుమార్, పీ చరణ్‌సాయితేజ, ఎం.సాయిరుత్విక్‌కేశ్, బాలికల విభాగంలో దీక్షిత, టీ ప్రజ్వలశ్రీ ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరు ఈనెల 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఘర్‌వాపసీకి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఇప్ప లక్ష్మయ్య

ఆసిఫాబాద్: ఇతర మతాల్లోకి వెళ్లినవారిని తిరిగి హిందూ మతంలోకి తీసుకువచ్చే ఘర్‌వాపసీ కార్యక్రమానికి ప్రతీ హిందువు కృషి చేయాలని ధర్మజాగరణ సమితి విభాగ్ ప్రముఖ్ ఇప్ప లక్ష్మయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హనుమాన్ దీక్షాపరులను చైతన్యపరిచారు. దేశవ్యాప్తంగా 900 గ్రామాల్లో 2.84 లక్షల మందిని ఘర్‌వాపసీ చేసినట్లు తెలిపారు. తెలంగాణలో రెండేళ్లగా సుమారు 20వేల మందిని ఘర్‌వాపసీ చేశామని చెప్పారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు బోనగిరి సతీశ్‌బాబు, ధర్మజాగరణ్ సమితి ప్రతినిధులు దయానంద, నేరెళ్ల లక్ష్మీరాజం, మేడ రాజలింగు, ఆలయ కమిటీ ప్రతినిధులు గుండ వెంకన్న, టీ మురళీధర్‌గౌడ్, కోట వెంకన్న, పిన్న వివేక్, ఎకిరాల శ్రీనివాస్, హనుమాన్ దీక్షాపరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాల సందర్శన

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని త్రిశూల్ పహాడ్ పైగల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆదివారం బీజేపీ తెలంగాణ ప్రవాస్ జిల్లా ఇన్‌చార్జి తుమ్మల పద్మజ లక్ష్మి స్థానిక మహిళా నేతలతో కలిసి సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వసతులపై ఆరా తీశారు. అనంతరం కేజీబీవీని సందర్శించి అక్కడి పరిస్థితులు తెలుసుకున్నారు. ఇటీవల ఒక విద్యార్థిని మృతి చెందగా, పలువురిని విధుల నుంచి తొలగించిన అధికారులు కొత్త వారిని ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. తక్షణమే కొత్త వారిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ నాయకురాలు కొత్తపల్లి అనిత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళ అదృశ్యం


బొర్కుట ప్రవంతి(ఫైల్)

దహెగాం: మండలంలోని పంబాపూర్ గ్రామానికి చెందిన బొర్కుట ప్రవంతి (30) అదృశ్యమైనట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. గత నెల 31న ఇంట్లో నుంచి వెళ్లిన ప్రవంతి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ప్రవంతి భర్త మొహన్‌దాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అందవెల్లిలో యువతి..

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అందవెల్లి గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఆదివారం ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. ఈనెల 1న అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. దీంతో ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. యువతి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.

నేటి నుంచి పది పరీక్షలు

ఉట్నూర్: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 132 ఆశ్రమ పాఠశాలలున్నాయి. పదో తరగతి విద్యార్థులు 3,901 మంది ఉన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 1776, ఆసిఫాబాద్‌లో 1250, మంచిర్యాలలో 460, నిర్మల్‌లో 415 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు దిలీప్‌కుమార్ మాట్లాడారు. వంద శాతం ఫలితాలు సాధించేలా ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక బోధన తరగతులు నిర్వహించామన్నారు. ప్రతి గిరిజన విద్యార్థికి పరీక్ష ప్యాడ్, చేతి గడియారం, జామెట్రీ బాక్స్, పెన్నులు, లాంగ్ స్కేల్ అందించినట్లు తెలిపారు.

ఐకే-ఓసీపీ హెచ్‌ఎంఎస్ పిట్‌కార్యదర్శిగా షేక్‌వలీ


షేక్‌వలీ

జైపూర్: మండలంలోని ఇందారం ఐకే-ఓసీపీ హెచ్‌ఎంఎస్ పిట్ కార్యదర్శిగా షేక్‌వలిని నియమించినట్లుగా హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆదివారం ప్రకటించారు. ఇందారం ఓపెన్ కాస్టులో ఈపీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న షేక్ వలి హెచ్‌ఎంఎస్ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నాడు. ఓపెన్‌కాస్టులో కార్మిక సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండడంతో ఈ బాధ్యతలను అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా షేక్‌వలి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఫిట్ కార్యదర్శిగా ఎంపిక చేసిన బ్రాంచి ఉపాధ్యక్షుడు జీవన్ జోయల్, కార్యదర్శి తిప్పారపు సారయ్య, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ అనిల్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగలు అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఖుడియార్ మొహల్లా కాలనీకి చెందిన ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌ను దొంగలించి బైక్‌పై పరారైన దొంగలను టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా రైల్వేగేట్ సమీపంలో నంబర్‌ప్లేట్ లేని బైక్‌ను ఆపి వారిని విచారించారు. సెల్‌ఫోన్ దొంగలించిన విషయాన్ని వారు ఒప్పుకున్నట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. నిందితుడు రోహిత్‌తోపాటు మరో మైనర్ బాలుడిని అరెస్టు చేయగా, మరొకరు పరారీలో ఉన్నట్లు వివరించారు.

నిదానంగా మైదానం పనులు


అసంపూర్తిగా ఉన్న సింగరేణి మైదానం

- పూర్తి కాని సింగరేణి స్టేడియం
- ఇబ్బంది పడుతున్న క్రీడాకారులు, వాకర్స్

శ్రీరాంపూర్: నస్పూర్‌లోని సింగరేణి స్టేడియం నిర్మాణ పనులు నిదానంగా సాగుతున్నాయి. ఈ పనులు మొదలు పెట్టి సంవత్సరం కావస్తున్నప్పటికీ పూర్తికాలేదు. శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఎస్సార్పీ ఓసీపీలో ముంపునకు గురైన తాళ్లపల్లి, సింగాపూర్, రామారావుపేట గ్రామాల నిర్వాసితులకు నస్పూర్ న్యూ నాగార్జున కాలనీ ఆనుకొని సర్వే నంబర్ 72లో ఆర్‌అండ్ ఆర్ కాలనీ ఏర్పాటు చేశారు. ఈ కాలనీతోపాటు సింగరేణి కాలనీల ప్రజల, క్రీడాకారుల నిమిత్తం సంవత్సరం క్రితం కాలనీల దిగువభాగంలో స్టేడియం ఏర్పాటు చేయడానికి కంపెనీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికీ నెలలు గడుస్తున్నా ఈ స్టేడియం పూర్తి కాలేదు. సుమారు 9ఎకరాల విస్తీర్ణంలో దీనిని సిద్ధం చేస్తున్నారు. చుట్టు కొంత భాగం ప్రహరీ, మరికొంత భాగం మెస్ వేసి బార్డర్ నిర్మించారు. మధ్యలో చాలా లోతట్టు ఉండడంతో దానిలో మట్టిపోసి చదును చేస్తున్నారు. ఇప్పటికీ సుమారు 10వేల క్యూబిక్ మీటర్ల మట్టిని పోశారు. అయినా ఇంకా చదును కాలేదు. పోసింది కూడా ఓసీపీ మట్టి కావడంతో అది తెల్లని దుమ్ముగా మారి క్రీడాకారులకు ఇబ్బందిగా ఉందని ఫిర్యాదులు రావడంతో అధికారులు దానిపై మళ్లీ ఎర్రమట్టి పోసి చదును చేయాలని నిర్ణయించారు. చుట్టూ వేసిన వాకింగ్ ట్రాక్ పూర్తిస్థాయిలో కాలేదు. పిల్లలు ఆడుకోవడానికి మైదానంలో ఓవైపు జారుడు బండ, ఉయ్యాలు, రౌండ్‌వీల్ ఏర్పాటు చేశారు. వీటి చుట్టు ఇసుక పోసి పిల్లలు ఆడుకోవడానికి అవునుగా తయారు చేయాలి. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు కట్టించాలనిస్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


పూర్తి కాని వాకింగ్ ట్రాక్

ప్రగతి స్టేడియంకు వెళ్లి ప్రాక్టీస్..

ఇటీవల పోలీసు, ఇతర శారీరక దారుఢ్యక పరీక్షలు ఉండే ఉద్యోగాల కోసం పోటీపడుతున్న యువకులు చాలా మంది ఈ స్టేడియం అందుబాటులో లేక 5కిలో మీటర్ల దూరంలో ఉన్న ప్రగతి స్టేడియంకు వెళ్లి ప్రాక్టీస్ చేసి వచ్చేవారు. వారి ఈవెంట్స్‌కు ముందే ఈ మైదానం పూర్తి అవుతుందని భావించిన ఈవెంట్స్ పూర్తి అయిన స్టేడియం పూర్తి కాలేదు. శ్రీరాంపూర్ డివిజన్‌లోని 3వేల కుటుంబాలు ఉండే నస్పూర్ కాలనీ, షిర్కే కాలనీ, నాగార్జున కాలనీ, గోదావరి కాలనీలతో పాటు ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వాసులకు ఇప్పటికి ఇక్కడ మైదానం లేదు. ఈ మైదానం కోసం చాలా ఏళ్లుగా ఎదురుచూస్తున్నప్పటికీ పనులు సకాలంలో పూర్తి కాక క్రీడాకారులు, వాకర్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

వాకింగ్‌కు ఇబ్బంది పడుతున్నాం



ఇంతపెద్ద కాలనీలో స్టేడియం లేకపోవడం వల్ల వాకింగ్ చేయడానికి ఇబ్బంది పడుతున్నాం. చేసేది లేక ఉదయం కాలనీలోని రో డ్లపై నడుస్తున్నాం. నెలల తరబడి స్టేడియం పనులు చేస్తున్నారు. త్వరగా పనులు పూర్తి చేయాలి.

– ఎం. కృష్ణారావు, వాకర్

మే నెలాఖరుకు పూర్తి చేస్తాం

మైదానం పూర్తి కావడానికి ఇంకా కొన్ని చేయాల్సిన పనులు మిగిలి ఉన్నాయి. లోలైన్ ఏరియాలో మరింత మట్టిపోయాలి. మే చివరి నాటికి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తాం.

– శివరావు, డీజీఎం(సివిల్), శ్రీరాంపూర్

కాలుష్య నివారణకు 'ఎఫ్‌జీడీ'


థర్మల్ పవర్ ప్లాంటులో అదనంగా నిర్మిస్తున్న రెండు చిమ్నీలు(ఎఫ్‌జీడీ నిర్మాణం)

- పర్యావరణహితంగా పవర్ ప్లాంటులో ఏర్పాటు
- రాష్ట్రంలోనే తొలి యూనిట్
- ముమ్మరంగా ఎస్టీపీపీలో నిర్మాణ పనులు
- వాయుకాలుష్య నివారణకు తోడ్పాటు
- రూ.700కోట్ల వ్యయంతో..
- అదనంగా మరో రెండు చిమ్నీలు

జైపూర్: కాలుష్యాన్ని నియంత్రిస్తూ... పర్యావరణహితంలో ముందజలో నిలుస్తూ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు దేశస్థాయిలో కీర్తి సంపాదిస్తోంది. మరో దశలో వాయి కాలుష్యాన్ని పూర్తిగా నివారించేందుకు చేపట్టిన ఎఫ్‌జీడీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కేంద్ర పర్యావరణ శాఖ ఆదేశాలతో సుమారు రూ.700కోట్లతో పర్యావరనాన్ని పరిరక్షించేందుకు రాష్ట్రంలోనే తొలి యూనిట్‌గా ఎఫ్‌జీడీ (ఫ్లూగ్యాస్ డీసల్ఫరైజేషన్) నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. జైపూర్ మండల కేంద్రంలోని 1200మెగా వాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు ద్వారా నిరంతరం విద్యుత్ ఉత్పత్తి చేస్తూ తెలంగాణ రాష్ట్రానికి విద్యుత్ కాంతులు పంచుతోన్న విషయం తెలిసిందే. థర్మల్ విద్యుత్ కేంద్రం అంటే బొగ్గును మండించి నీరును ఆవిరిగా మార్చే ప్రక్రియలో టర్రైన్ తిప్పడంతో విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. అయితే బొగ్గును మండించే క్రమంలో పొగలో సల్ఫర్, కార్బన్, లెడ్‌తో పాటు మరిన్ని విషవాయువులు వెలువడుతాయి. వెలువడే విషవాయువులతో చుట్టూ ఉండే పర్యావరణాన్ని కలుషితం చేయడంతో పాటు పరిసర ప్రాంతాల వాసులకు హానీ చేకూర్చే ప్రమాదం ఉంది. దీని మూలంగా సమీపంగా ఉండే ప్రజలు వ్యాధులు, రోగాల బారిన పడే అవకాశం నెలకొంది. వాతావరణం కలుషితమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉండే ప్రమాదం లేకపోలేదు. ఎఫ్‌జీడీల నిర్మాణానికి ముందు సల్ఫర్ ఆక్సైడ్ వాయువు ఘనపు మీటరుకు 2000 మిల్లీ గ్రాములు ఉంటే ఎఫ్‌జీడీ నిర్మించిన తర్వాత అందులో విష వాయుల శాతం 200మిల్లీ గ్రాములకు తగ్గనుంది. ఎఫ్‌జీడీ నిర్మాణంతో వాతావరణంలో వాయు కాలుష్యం దాదాపు తగ్గిపోయే అవకాశం ఉండడంతో పాటు ఇక్కడి ప్రాంత ప్రజల ఆరోగ్యంపై ప్రభావం తగ్గే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

అదనంగా మరో రెండు చిమ్నీలు....

ఎస్టీపీపీలో యూనిట్-1, యూనిట్-2 రెండు బాయిలర్లను అనుసందానం చేస్తూ మొదట 285 మీటర్ల ఎత్తులో ఒక్క చిమ్నీ నిర్మించగా దీనికి సమీపంలో 600మెగా వాట్ల ప్లాంట్లు రెండు ఉండగా వాటికి ప్రత్యేకంగా 150 మీటర్ల ఎత్తుతో మరో రెండు చిమ్నీల నిర్మాణాన్ని వేరువేరుగా నిర్మిస్తున్నారు. వీటి ద్వారా విషవాయుల ప్రభావాన్ని తగ్గించి కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించనున్నారు. ఇంతకు ముందు ఉన్న ఒక్క చిమ్నీకి అదనంగా మరో రెండు చిమ్నీల నిర్మిస్తుండటంతో పవర్ ప్లాంటు చూడటానికి మరో కొత్త రూపంగా కనిపిస్తోంది. మొదటి చిమ్నీని దాదాపు పూర్తి కావస్తుండగా రెండు కూడా సగానిపైగా పూర్తయ్యాయి. ఈ ఏడాది చివరికల్లా వీటి నిర్మాణాలు పూర్తి చేయాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. కాగా వీటికి అనుసందానంగా నిర్మిస్తున్న ఇటర్ కనెక్టింగ్, ఫౌండేషన్, అబ్జర్వర్, ట్యాంకులు, బూస్టర్ ఫ్యాన్స్, ఫ్యూయల్ ఫ్యాబ్రికేషన్ పనులు దాదాపు పూర్తికావచ్చాయి.

దుర్గం రాజేశ్‌ను సన్మానించిన ఎమ్మెల్యే


రాజేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్, బాబుజగ్జీవన్‌రామ్‌ల జయంతిని రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్‌గా నియామకమైన మంచిర్యాలకు చెందిన తెలంగాణ నేతకాని మహార్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్‌ను ఆదివారం బెల్లంపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నేతకానీ వర్గీయులతో కలిసి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్, బాబుజగ్జీన్‌రామ్‌ల జయంతి నిర్వహించే రాష్ట్ర కమిటీలో రాజేశ్‌కు చోటు కల్పించడంతో తెలంగాణ రాష్ట్రంలో నేతకాని కులాన్ని మరోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తించినట్లైందన్నారు. రాష్ట్ర కమిటీలో ప్రాతినిధ్యం కల్పించడానికి తోడ్పడిన రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, నేతకాని, మహార్‌సంఘం నాయకులు నర్సయ్య, రాజం, గోపాల్, గోళ్ల రాజమల్లు, సునార్కార్ రాంబాబు, భీమయ్య, ప్రకాష్, బాను ప్రసాద్, శ్రీనివాస్, రాంచందర్, విశ్వనాథ్, గొర్లపల్లి విజయ్, గొర్లపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

చెరువులో దూకి డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

లోకేశ్వరం: చెరువులో దూకి డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పుస్పూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం.. పుస్పూర్‌కు చెందిన దీపిక (17) భైంసా పట్టణంలోని ఓ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని తాత పెద్ద ముత్తన్న వీఆర్ఏ గతనెల 20న గుండెపోటుతో మృతిచెందాడు. తాత చనిపోవడంతో దీపిక మానసికంగా కుంగిపోయి బాధపడుతుండేది. ఆదివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లింది. ఎంత సేపటికి రాకపోవడంతో అనుమానంతో కుటుంబీకులు వెతికారు. గ్రామ శివారులోని బోప్పాజీ చెరువులో దీపిక మృతదేహం లభించింది. తండ్రి చిన్న ముత్తన్న ఫిర్యాదుతో మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహనీయులను స్మరించుకోవాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్
- సర్ధార్ సర్వాయి పాపన్నకు నివాళి


మాట్లాడుతున్న వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్

పాతమంచిర్యాల: మహనీయులను స్మరించుకోవడం మన సంప్రదాయమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ 314వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. సర్వాయి పాపన్నగౌడ్ చిత్ర పటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వాయి పాపన్న గొప్ప పోరాట యోధుడన్నారు. చిన్న కుటుంబంలో పుట్టి దేశం గర్వించదగ్గ వ్యక్తిగా పేరు ప్రతిష్టలు సంపాదించుకున్నాడని తెలిపారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాడన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్ మాట్లాడుతూ సర్ధార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర, ఆయన చేసిన పోరాటాలను పాఠ్యాంశాలుగా చేర్చాలని కోరారు. జిల్లా కేంద్రంలో సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. 60 ఏళ్లు నిండిన గీత కార్మికులకు పింఛన్, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి వినోద్‌కుమార్ తెలంగాణ బీసీ జాగృతి అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు వైద్య భాస్కర్, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మోకు దెబ్బ ఆధ్వర్యంలో..

జిల్లా మోకు దెబ్బ, గౌడ సంక్షేమ సంఘం నాయకులు జిల్లా కేంద్రంలో సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి నిర్వహించారు. పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో జిల్లా మోకుదెబ్బ, గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, మహేందర్‌గౌడ్, నరేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నెరవేరనున్న వంద పడకల ఆస్పత్రి కల

- ఇటీవల శంకుస్థాపన చేసిన మంత్రి
- నిర్మాణ పనులు సొంతం చేసుకున్న క్రిషి నిర్మాణ సంస్థ
- త్వరలోనే ప్రారంభం కానున్న పనులు



చెన్నూర్‌లో నిర్మించే ఆస్పత్రి నమూనా

చెన్నూర్: చెన్నూర్ ప్రాంత ప్రజల కల నెరవేరనుంది. 50పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసుకుని మరో వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి ముహూర్తం ఖరారుచేసుకుంది. గత నెల 15న ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ చేసిన విషయం తెలిసిందే. నిర్మాణ పనులను క్రిషి కన్‌స్ట్రక్చర్స్ సొంతం చేసుకుంది. త్వరలోనే నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. వంద పడకల అనుపత్రి నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతంలోని అన్ని రకాల రోగులకు మెరుగైన వైద్య సేవలందనున్నాయి.

అధునిక హంగులతో...

చెన్నూర్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఇప్పటికే రూ.7కోట్ల నిధులతో 50 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని చెన్నూర్ కేంద్రంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి విప్ మరో రూ.37.07 కోట్ల నిధులు మంజూరు చేయించారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి పాలనపరమైన అనుమతులు సైతం లభించాయి. దీంతో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పనులకు భూమిపూజ చేశారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వ విప్ వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి కృషి చేశారు.

మాతాశిశు కేంద్రంగా ప్రతిపాదన..

చెన్నూర్ పట్టణంలో ప్రస్తుతం నిర్మిస్తున్న 50 పడకల ఆస్పత్రిని మాతాశిశు కేంద్రంగా మార్చాలని ఇటీవల చెన్నూర్ పర్యటనకు వచ్చిన ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు ప్రభుత్వ విప్ బాల్క సుమన్ విన్నవించారు. 50 పకడల ఆస్పత్రిని మాతాశిశు కేంద్రంగా మార్చినట్‌లైతే మహిళలతో పాటు శిశువులకు సైతం మెరుగైన వైద్యం అందనుంది. గర్భిణులతో పాటు పిల్లలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా ఈ ప్రాంత తల్లులు మంచిర్యాలతో పాటు కరీంనగర్ పట్టణాలకు తరలివెళ్తున్నారు. దీంతో నిరుపేదలకు దూరంభారంతో పాటు ఆర్థిక భారం పడుతోంది. చెన్నూర్‌లోనే మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తే ఎంతో మేలు జరగనుంది.

భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని...



చెన్నూర్ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు 50 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం చేపట్టాం. పెరుగుతున్న జనాభాతో పాటు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి పూనుకున్నాం. ఈ ఆస్పత్రిని ఆధునిక హంగులతో నిర్మిస్తాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

–బాల్క సుమన్, ప్రభుత్వ విప్, చెన్నూర్

జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్య

సారంగపూర్: జీవితంపై విరక్తితో వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన సీరె అశోక్ (60) గత కొన్నేళ్ల క్రితం భార్య, కుమార్తెతో విడిపోయి ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో తన ఆరోగ్యం దెబ్బతినడంతో తనను ఆదరించేవారు లేక మరింత అనారోగ్యానికి గురయ్యాడు. సక్రమంగా భోజనం చేసేవాడు కాదు. ఆరోగ్యం సహకరించకపోవడం, అన్ని పనులు చేసుకోలేక తీవ్ర మనస్తాపం చెందాడు. ఆదివారం తన ఇంటి ముందు పందిరిగుంజకు ఉరేసుకుని అశోక్ ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు, మృతుడి చెల్లె ఎరాడ్ల లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతోపాటు 16 ఏళ్ల కుమార్తె ఉన్నారు.

ఇంటికో ఉద్యోగం ఏమైంది

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రఘునాథ్‌రావ్

మంచిర్యాలక్రైం: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వా త ఇంటికో ఉద్యోగం ఇస్తానని మన ఉద్యోగాలు మ నకే, మన నీళ్లు మనకే అంటు బాడాయిలు కొ ట్టిన కేసీఆర్ ఇంటికో ఉద్యోగం ఏమైందో చెప్పాలని బీజే పీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యలయంలో ఆదివారం ప లువురు బీజేపీలో చేరారు. మంచిర్యాల 32వ వా ర్డుకు చెందిన వివిధ పార్టీలక చెందిన 50 మంది బీ జేపీలో చేరారు. వారికి రఘునాథ్‌రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా సైనికుల్లా పనిచేయాలన్నారు. కష్టపడి పని చేసిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రాలు అమ్ముకుని నిరుద్యోగుల జీవి తాలతో కేసీఆర్ కుటుంబం చెలగాటం ఆడుతోంద ని ఆరోపించారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ నీటిమూటలయ్యాయని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే అన్నివర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరుగుతుందని తెలి పారు. కార్యక్రమంలో రజనీ ష్‌జైన్, ఆకుల అశోక్ వర్ధన్, ఆవిడపు రాజబాబు, దేవులపల్లి లక్ష్మీ నారా యణ, బోయిని హరికృష్ణ, గాజుల ప్రభాకర్, రాజమౌళి తదతరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే బీజేపీ లక్ష్యం

ఖానాపూర్: మహిళా సాధికారతే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ ఏపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పొన్నాల లక్ష్మిసంతోషి అన్నారు. మండలంలోని తర్లపాడ్ గ్రామంలో గల ఓంకారేశ్వర ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమెను నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలతోపాటు పలువురు గ్రామస్తుల ఇళ్లకు వెళ్లి కేంద్ర పథకాల అమలు తీరుపై అడిగి తెలుసుకున్నారు. ప్రధాని మోదీ తలపెట్టిన మహిళా మోర్చా ప్రవాసీయోజనలో భాగంగా మాతా, శిశుసంరక్షణ, మహిళలకు స్వేచ్ఛ తదితర విషయాలపై వారితో మాట్లాడారు. పట్టణంలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలికల పాఠశాలను సందర్శించి సౌకర్యాలు, వసతులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. పది పరీక్షల్లో ధైర్యంగా రాసి పాఠశాల, తల్లిదండ్రులు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఆమె వెంట పెంబి జెడ్పీటీసీ జానుబాయి, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ పడాల రాజశేఖర్, నాయకులు నాయిని సంతోశ్, టేకు ప్రకాశ్, తోకల బుచ్చన్న, డి.మల్లయ్య, గిరి, పెద్ది రమేశ్, ఎనగందుల రవి, ఇనుముల స్వామి, మేకల వెంకటేశ్, సుధాకర్, రాము, రాజేశ్వర్, సాయి ఉన్నారు.

బైక్ చోరీ

భైంసా: బాసర ఆలయ సమీపంలో ఓ బైక్ చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు బైక్‌పై వచ్చి ఆలయం ఎదుట వాహనం నిలిపాడు. దర్శనం అనంతరం చూసేసరికి బైక్ కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు.

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి

కడెం: మండలంలోని అంబారిపేట్‌లో ఆదివారం తెల్లవారుజాము గొర్రెల మందపై వీధికుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో 20 గొర్రెలు మృతిచెందగా, మరో ఐదు ప్రాణాపాయస్థితిలో ఉన్నట్లు బాధిత రైతు కొండవేణి కొమురయ్య తెలిపాడు. గొర్రెల విలువ సుమారు రూ.2 లక్షల 50 వేలు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం అందించాలని వేడుకున్నాడు.

జై బోలో హనుమాన్ కీ

- ఘనంగా విజయయాత్ర
- హనుమాన్ నామస్మరణతో మార్మోగిన వీధులు


భక్తులతో కలిసి నృత్యం చేస్తున్న రాష్ట్రమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: రామలక్ష్మణ ×జానక్కీ జై బోలో ×హనుమాన్కి అంటూ జిల్లా కేంద్రం హనుమాన్ నామస్మరణంతో మార్మోగింది. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం వీర హనుమాన్ విజయయాత్ర పట్టణ పురవీధుల గుండా ధ్యగావాడ, బాగులవాడ, బస్టాండ్ లైన్, బుధవార్‌పేట్, గాంధీచౌక్ మీదుగా కొనసాగింది. భక్తులు తమ ఇళ్లపై నుంచి హనుమాన్ విగ్రహంపై పూల వర్షం కురిపించారు. కాషాయ జెండాలతో జైశ్రీరామ్, జై హనుమాన్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ తీశారు. ఇందులో ముంబైకి చెందిన డోలషా బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువత, స్వాములు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. సుమారు రెండువేల మంది హిందువులు యాత్రలో పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక దేవరకోట దేవస్థానం వద్ద రాష్ట్రమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ హనుమాన్ విగ్రహానికి పూజలు చేసి, జెండా ఊపి విజయ యాత్రను ప్రారంభించారు. మంత్రి నృత్యం చేసి, బ్యాండ్ కొట్టి అందరిని అలరించారు. నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ దగ్గరుండి ర్యాలీని పర్యవేక్షించారు. ప్రార్థన స్థలాల వద్ద భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, దేవరకోట ఆలయ చైర్మన్ లింగంపల్లి లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్, బీజేపీ నాయకుడు అప్పల గణేశ్‌చక్రవర్తి, వక్తలు జిన్నా సత్యనారాయణ, డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి, శ్రీనివాస్, రఘునందన్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, బజరంగ్ దళ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మంచినీటి పంపిణీ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో వీర హనుమాన్ విజయయాత్ర సందర్భంగా శ్రీధర్మశాస్త యూత్ సభ్యులు భక్తులకు ఉచిత మంచినీటి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌కు నీటిని అందించారు. యూత్ సభ్యులు పులివేలి మణికంఠ, బాశెట్టి సాయికృష్ణ, చింతపందు రమేశ్, తూర్పు రమేశ్ ఉన్నారు.